



# కేలండరు తగూ

రామావతారం ఎన్ని అవతారాలెత్తితేనేం చివరికి వాళ్ళన్నయ్య సూర్యనారాయణ క్లాసుమేటు, ఫ్రెండు సత్యానందం తాలూకొకాయన వెంకట్రావుకి దగ్గర బంధువైన రామకృష్ణ దగ్గరనుంచి ఓ కేలండరు మొత్తంమీద సంపాదించాడు. క్రొత్త సంవత్సరాలు ఒకదాని తర్వాత మరొకటి వచ్చినా, రామావతారం

మాత్రం కేలండరు సంపాదించడం కోసం తాపత్రయపడడం ఇదే ప్రథమం. ఇంతకి ముందు తనకి వాటిమీద మనసులేకో మరి యిచ్చే దాకలు లేకో. కేలండరంటే "అ దానికేం' అంటూ పెదవి విరిచేవాడు.

ఆనాడు శ్రీకృష్ణుడు కూడా అన్ని కష్టాలు పడి ఉండడు పారిజాత వృక్షాన్ని దేవలోకంనుంచి తీసుకొచ్చినప్పుడు, ఎలాగైతేనేం కేలండరు సంపాదించానన్న పరమానందంతో రామావతారం కేలండరు విప్పి బొమ్మను చూశాడు. ఎంతో చక్కగా కుదిరిన ఓ అమ్మాయి ఆ కేలండరుకి మరింత అందమిచ్చింది. చూడ ముచ్చటగా వుంది. ఎంతో హుషారుగా యింట్లో తన గదిలో మంచానికి ఎదురుగా తగిల్చి మంచం మీదికి ఒయ్యారంగా జారపడి ఎడం చేతో బూటు విప్పుకుంటున్నాడు.

బూటు శబ్దం విని అయ్యగారొచ్చారని టిప్‌టాప్‌గా తయారైన అమ్మాయిగారు పొగలుగక్కుతున్న కాఫీగ్లాస్‌తో త్రెడ్డెస్సు తొంగించి కుడిపాదం లోపలికి పెట్టింది. అబ్బాయిగారి వాలకం చూసి. ఎదురు గోడకేసి ఆ అమ్మాయిగారు చూశారు. కళ్లు ఒక్కసారి మూసుకొని మరింత చేసుకొని మళ్ళీ రెప్పవెయ్యకుండా చూసింది. బాగా దగ్గరగా వెళ్ళి యెడం చేతో గడ్డం పట్టుకొని బాగా చూసింది.

"ఏమిటండీ! ఇంకా చిన్నపిల్లల బుద్ధులు పోలేదు?" అంది మొహం త్రిప్పుకుంటూ. రామావతారం అమ్మాయిగారిడాన్ని చూస్తున్నాడు చాలా కాలమైందేమో చూసి. "ఇద్దరు బిడ్డల తండ్రయినా యింకా యిటువంటి బొమ్మలు యింట్లో పెడుతున్నారు. ఏమిటిదంతా!' అంటూ కాఫీగ్లాసు బల్లమీద పెట్టి, కేలండర్ని చుట్టచుట్టి కిటికీలొంచి బయటకు విసిరేసింది. తను విజయం పొందినట్లు పెదాలమీద ఓ చిన్న చిరునవ్వు విసిరింది శైలజ. ఎన్నో ప్రయత్నాల మీదా కేలండరు సంపాదించేదేమో రామావతారం మనస్సు చివుక్కుమంది. అంతులేనూ క్రొత్త సంసారంలో మొదటిది కాదాను. వెంటనే భార్యను ఏమీ అనలేక బయటికి వచ్చేశాడు. ఇంతలో వాళ్ళ తమ్ముడు ప్రసాదరావు కేలండరుతో ప్రత్యక్షమయ్యాడు.

బయట విసిరేస్తున్నా రేమిట్రోయ్. యింత మంచి కేలండర్ని అన్నాడు ప్రసాదరావు. రామావతారం మనస్సులో సంతోషించాడు. తన కేలండరు మళ్ళీ యింటికి వచ్చినందుకు. పైకి "నువ్వు తీసుకోరా" అంటూ చిన్నగా నవ్వుతున్నాడు. ప్రసాదరావు నవ్వుతుంటే అప్పుడప్పుడు ఆమె చూస్తుండవచ్చు అనుకొన్నాడు అంతర్యంలో

ప్రసాదరావు బి. ఎ. చదువుతున్నాడు. యింకా పెళ్ళి కాలేదేమో, అమ్మాయిల బొమ్మలుండే కేలండర్లు దాస్తాడనడంలో సందేహం అక్కరలేదు. కాని, ఓ చిన్న సంశయం పట్టుకుంది. కేలండరు అమోఘంగా వుంది. దానికి తిరుగులేదు. కాని ఎక్కడతగిల్చాలా అని. అతనికి ప్రత్యేకంగా గదసేద లేదు. పెళ్ళయిన ఇద్దరన్నలూ రెండు గదులు ఆక్రమించారాయె! హాల్లో తల్లిదండ్రులు వుంటారు. కోప్పడతారు కూడాను. ఆలోచిస్తూ సిగరెట్టు కాలుస్తున్నాడు. సిగరెట్టయిపోయి వేలు కాలితేనేకాని ఈ లోకంలోకి రాలేదు ప్రసాదరావు. చివరికి ఆ కేలండర్ని తనకి బాగా తెలిసిన స్నేహితునికిచ్చి, వాడి గదిలో పెడితే. తరచుగా అక్కడైనా తను చూసుకోవచ్చును అనుకున్నాడు. బ్రహ్మాండంగా వుందనుకున్నాడు బాబీయూ! తిన్నగా ఆ కేలండర్ని తీసుకెళ్ళి తాతయ్యబాబుకిచ్చాడు. తాతయ్యబాబు చాలా మంచివాడు. ఎవరు ఏమి చెప్పినా శ్రద్ధగా వింటాడు. స్నేహితులంటే అభిమానం. అతం భతం తెలియదు తల్లిదండ్రులకు తెలిస్తే బాగోదని అనుకొని, స్నేహితుడు ప్రసాదరావు

మాట తీయలేక ఎలాగో తన గదిలో తగిలాడు. తాతయ్యాబాబు కళ్ళకు ఏదో క్రొత్తగా కన్పించింది. తన గదేనా అనుకున్నాడు. తను పొరపాటుపడటం లేదని నిర్ధారణ చేసుకున్నాడు. తాతయ్యాబాబు మనస్సులో ఆలోచనలు వస్తున్నాయి. వాళ్ళమ్మ చాలా ఛాందసురాలు. కేలండర వేది ఏదైనా వుంటే అది దేవుడిదై వుండాలంటుంది. అదైనా పూజా గృహంలోని మండపంలో వుండాలి. అటువంటామె కన్పిస్తే ఇది ఎలాగో అని అనుకుంటున్నాడు. మనస్సు చిక్కపట్టుకొని ప్రసాదరావు మాట తీయలేక తన డ్రాయరుకు ఎదురుగా మేకు కొట్టి కొంచెం మూలగా తగిలించాడు అరుగుమీద తన గదిలో.

రోజురోజూ తాతయ్యాబాబు భయపడుతూనే వున్నాడు. రోజులు భారంగా గడుస్తున్నాయి. లోపలచాలా యిదవుతున్నాడు. రెండు రోజులు గడిచాయి. మూడవరోజు ప్రళయం వచ్చినంత పనైంది. అనుకోకుండా వాళ్ళమ్మ తిన్నగా వచ్చి చూసిందా కేలండరు బొమ్మను.

“ఇక నే [illegible] పుతున్నావు ఏమ్మా, మాట. యి. బా[illegible]డ్డపే. అందుకనే ఈ కాలేజీ స్వాతంత్ర్యంగా చెడిపోతుంటారు. లేకపోతే పక్కింటి రామాయమ్మగారి పెద్దబ్బాయి కృష్ణమూర్తి యిక్కడ వున్నన్నాళ్ళూ చాలా మంచివాడనుకున్నాము. సరే యిక పెద్ద చదువులకని విశాఖపట్నంలో చదువుకని వెళ్ళి, ఎవరో ఏ కులమో అమ్మాయి అదేదో దిక్కుమాలిన పెళ్ళి ... రిజిష్టరు పెళ్ళట. చేసుకున్నాడు అయ్యో రామ” అంటూ బుగ్గ నొక్కుకుంది. తాతయ్యాబాబు కిక్కురు మనకుండా కూచున్నాడు. “ఇంట్లో ఇలా గుడ్డలులేని అమ్మాయిల బొమ్మలు తగల్పవచ్చురా? అసలు వీటన్ని ప్రయోజనం ఏముందిలే? వెధవ పుస్తకాలన్నీ ఎవి అమ్మాయిల బొమ్మలో వేస్తారు. దాన్నిదాచి కుర్రకారు, వెర్రెక్కిపోయి కొనేస్తుంటే యికనేం వాళ్ళ డబ్బు వాళ్ళకొస్తుంది. అయినా నీదేం పోయ్యే కాలంరా? క్షేమంగా చదువుకోక ...” అంటూ ఒక్క ఊపులో ఆ కేలండర్ను లాగి మేకుతోసహా బయటకి గిరాటువేసింది.

తాతయ్యాబాబు కేలండర్ని తీసి దాచి పెడుతుండగా, పరంధామయ్యగారు బజారునుంచి వచ్చాడు కాళ్ళు కడుక్కుంటూను. తల్లి కంగారుగా చెంబుతో నీళ్ళు తెచ్చి “కృష్ణా రామా కేశవా మాధవా...” అంటూ లెంపలేసుకొని ఆ కేలండరు తగిల్చిన గోడని నీళ్ళతో కడిగేస్తుండగా... “ఏమిట్రా అవ్వాయి. ఆ గొడవ” అంటూ కళ్ళజోడు పైకి తీసుకుంటూ పరంధామయ్యగారడిగారు.

“ఏమీ లేదు నాన్నా! ఏదో కేలండరు బాగాలేదని తీసేస్తుంది.” అని ముక్తసరిగా తేల్చేశాడు తాతయ్యాబాబు ఏమీ తెలియనట్టు.... “ఏదీ నన్నూ చూడనియ్యి. ఎలాంటిదో ఏమిటో... కథ” అంటూ పర్చలో కూలబడి చుట్ట ముట్టించాడు. తాతయ్యాబాబు కేలండరు యిచ్చాడు. విప్పి చూచి, కళ్ళజోడు తుడిచి మళ్ళీ పెట్టు[illegible] పరికించి ఆమూలాగ్రం చూశాడు.

“ఏసి మా తాత... ఇది ...” అన్నాడు ఎంతో ఉత్సాహంగా. ఆనంద రేఖలు తొంగి చూచాయి. ఎభై అయిదేళ్ళ వయస్సులోను.... ఇది సినిమా తార కాదు. ప్రత్యేకంగా ఆ కంపెనీ వారు డబ్బిచ్చి తీయించుకుంటారు ఆ అమ్మాయిల అందాన్ని బట్టి వేలకి వేలు ఇస్తారు. అంటూ తనకి తెలిసిన సంగతినంతటినీ ఒక ముక్కలో చెప్పాడు తాతయ్యాబాబు. “ఏదైతేనేం, బాగుందమ్మాయి. కానీ, మీ అమ్మ ఇటువంటివి, ఇళ్ళల్లో వుండకూడదంటుంది. వట్టి అయోమయం మనిషి. ఒక అందం చందం తెలీదు. ఎవరూ ఇళ్ళల్లో పెట్టుకోకపోతే ఇవి ఎందుకేయిస్తారు? సరేలే. దాన్ని పట్టుకెళ్ళి జాగ్రత్తగా దాచుకో” అని మొహం అదోలా పెట్టాడు. క్యాలెండరు

ఎన్ని యిళ్ళు మారిందో, యింకా ఎంత మందిళ్ళు చూడాలనుకుంటుందో! ఆ బొమ్మ తనను చూసి నవ్వుతున్నట్లు అని పించింది. ఎవరికైనా యిచ్చేద్దామనుకొని తీసుకొని బయల్దేరాడు.

మోహనరావు ఈ మధ్యనే లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషనులో క్రొత్తగా చేరాడు. బందరునుంచి యిక్కడికి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చాడు. మోహనరావు, పేరుకు తగ్గట్టుగా చాలా అందంగా వుంటాడు. అదే ఓ అమ్మాయి అయితే నాల్గు కాగితాలు నింపిపోతాయి. అది అంతే మరి! వరుసకి తాతయ్యాబాబుకి మేనమామ అవుతాడు. ఈ వూరొచ్చి దాదాపు వారం రోజులైనా అతను వాళ్ళ యింటికి వెళ్ళలేదు. ఆ రోజే సడన్‌గా కాఫీ హోటలు దగ్గర కన్పించాడు తాతయ్యాబాబు. యింటికి రమ్మన మన్నాడు. ఖాళీ చేసుకు వస్తా నన్నాడు మోహనరావు.

తాతయ్యాబాబు చేతిలో కేలండర్ని పుచ్చుకొని విప్పిచూశాడు. మోహనరావు. చాలా బాగుందిరా. నా దగ్గర వుంచకూడదా ఇటువంటిది అని చెప్పాడు. చివరికి, "ఒరేయ్! నేను ఈ వూరు క్రొత్తగా వచ్చాను. యిక్కడ యింకా ఎవ్వరూ సరిగా ఎరగరు వచ్చే సంవత్సరం దాని లాంటి కేలండర్లు నీకిస్తాను. దాన్ని మాత్రం ఇచ్చేయిరా!" అన్నాడు మోహన రావు

దాన్ని ఎలాగైనా ఎవరికైనా ఇచ్చి వదుల్చుకోవాలనుకుంటున్న తాతయ్యాబాబుకి బరువు తగ్గినట్లు మొహం వికసించింది. కాని పైకి ఇంత మంచి కేలండర్ని ఇంకొకటి ఇస్తాను అన్నాడు. "అబ్బెబ్బే ఇందులో ఓ కథవుంది. ఇదే నాకు కావాలి అయినా నీకెందుకురా! ఇది" ఆశ్చర్యంగా చూశాడు తాతయ్యాబాబు వైపు. ఆమాపులో మోహనరావు, లలిత కన్పించారు. లలిత చక్కని చుక్క. ఈ మధ్యనే మోహన రావు పెండ్లి చేసుకున్నాడామెను! గుండ్రని మొహం, చామనఛాయ రంగు, చిరునవ్వుతో మొహం చాలా అందంగా ఉంటుంది. క్రొత్తగా ఈ మధ్యనే కాపురా నికి వచ్చింది. మోహనరావుకి అటువంటి సందర్భంలో క్రొత్త కాపురంగా మరి ఇటువంటి కేలండర్లమీద మోజుండడం సహజం అనుకొని సరే తీసుకెళ్ళు వీలైనప్పుడు ఇంటికిరా అన్నాడు తాతయ్యాబాబు. మోహనరావు కేలండర్ని తీసుకొని ఈల పాట పాడుకుంటూ ఇల్లు చేరాడు. హాల్లో రేడియో పైన గోడ మేకునున్న దేవుని పటం తీసేసి, తను పట్టుపట్టి తెచ్చుకున్న కేలండరు తగిలించాడు. సన్నగా రేడియో ట్యూన్ చేశాడు. మంచి కేలండరు తీసు కొచ్చానన్న విజయ గర్వంతో, తదేకంగా రేడియోలోంచి సన్నగా వస్తూన్న లతా మంగేష్కర్ పాట వింటూ, బొమ్మకేసి చూస్తూ కూర్చున్నాడు. రేడియో సంగీతం వినిపించగానే లలిత మోహనరావు వచ్చాడనుకొని ప్లేటుతో ఫలహారం. మంచి నీళ్ళ గ్లాసుతో హాల్లోకి వచ్చింది మోహన రావుని చూసి. అతను అదేపనిగా చూస్తూన్న కేలండర్ని కూడా చూసింది. రెండు నిమిషాలు రెప్ప వెయ్యకుండా చూసి, సిగ్గుతో తలవంచుకొని అంతకంతకీ చిన్న పిల్లలై పోతున్నారండీ! మరీను అంది.

"ఏం! ఎందుకేం!" ప్లీడరు గారిలా మొహం పెట్టాడు.

"అది కాదండీ! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారండి ఇది యిల్లా మరే మైనానా! అటువంటి అమ్మాయిల బొమ్మా అందులోనూ నగ్నంగా వున్నదాన్ని... కేలండరు తగిలిస్తారా, నాకేం నచ్చలేదండీ మీ వరస...' అంది మొహం చిన్నది చేసు కొని.

"ఏం చెత్తనం! ఇది మీ నాన్న నాకు కట్నం కింద యిచ్చింది కాదు. పెట్టెలో పెట్టి దాచేయటానికి, ఇది నాది, నా స్వంతం, నేను ఉద్యోగం చేసుకుంటు న్నాను. నా కాళ్ళమీద నేను బతుకుతున్న ప్పుడు ఈ మాత్రం స్వతంత్రం వుండదా! ఈ ఇంట్లో!" అంటూ మొహం కంద గడ్డలా చేసుకున్నాడు. "ఎందుకంత

కోపం? ఏమన్నావని" అంటూ వెళ్ళిపోయింది వంటింట్లోకి లలిత.

మర్నాడు మోహనరావు ఆఫీసునుంచి రాగానే ఎదురుగా బోడిగావున్న రేడియో పై భాగం కనిపించింది. కేలండరు ఏమైందా అనుకుంటూ చూశాడు. ఎగిరిపోయి కింద కాని పడిందేమోనని. కాని ప్రయోజనం లేకపోయింది. ఎంతో ఆప్యాయంగా చూసుకుంటూన్న ఆ కేలండరిని లలితే తీసి వేసుండాలనుకున్నాడు.

"...కేలండరు ఏమైందిక్కడిది?...." అన్నాడు గట్టిగా మోహనరావు. ఒక్కసారిగా ఉలిక్కిపడి .... నాకేం తెలీదు .... అంది మామూలుగా లలిత, మొహం చిన్నది చేసుకుంటూను. కాసేపు మాట్లాడకుండా మౌనంగా కూర్చున్నాడు. ఏమన్నా లాభం లేదని సిగరెట్టు వెలిగించాడు. కాఫీ తీసుకొచ్చి అందియ్యబోయింది లలిత సుకుమారంగా.... మళ్ళీ తాగుతాను ... అంటూ గబగబా బయటికి వెళ్ళిపోయాడు. ఇంత చిన్న విషయానికి పట్టించుకోని యిద్దరిమధ్యా చాలా అపోహ పెరిగి చివరికి కోపంగా మారింది. దాంతో రాత్రికి భోజనం చెయ్యకుండా మోహనరావు పడుకున్నాడు.

మరునటి రోజు నుండి ఆ క్రొత్త కాపురంలో క్రొత్తగా చిగురించిన కేలండరు తగాదాతో పూర్తిగా మాట్లాడుకోవటం మానేశారు. వంటయినట్లు, ఏ కంచానో కప్పుడు చేస్తే భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళవస్తున్నాడు. అలా నాలుగు రోజులైంది. వారికి అభిమానం పోలేదు. ఎవరికివారే తప్పు చేయలేదని ముందు తనెందుకు మాట్లాడాలని పంతం పట్టుకున్నారు.

ఓ రోజు తాతయ్యబాబు బజార్లో కలిస్తే విశేషాలు ఏమిటన్నాడు మోహనరావు. "విధవ కేలండరు ఇచ్చి మా ఇద్దరికీ దెబ్బలాట తెచ్చావు." మొదటినుంచి జరిగిందంతా తాతయ్యబాబుకి చెప్పాడు.

తాతయ్యబాబు నవ్వుకుంటూ... బాగుంది: నాకో ఐడియా తట్టింది. అంటూ తను ఊహించిన ప్లాను గురించి మోహనరావుకి ఉపదేశించాడు. మర్నాడు మోహనరావు ఆఫీసుకుపోతూ, తాతయ్యబాబు చెప్పినట్లు సాయంకాలం ఫస్టుషో పిక్చర్‌కి వెడదాము, రడీగా వుండు! అని కాగితం మీద వ్రాసి రేడియో బల్లమీద ఎదురుగా పౌడరు డబ్బా ఎత్తు పెట్టి వెళ్ళిపోయాడు ఆఫీసుకు.

ఆ కాగితం చూసుకున్న లలిత ఆవిధంగా సాయంకాలం ముస్తాబై రెడీ అవుదామని తయారవుతుండగా మోహనరావు వచ్చేడు. మోహనరావుకూడా మొహం కడుక్కొని, బట్టలు వేసుకుంటున్నాడు. తీరా యిద్దరు ముస్తాబయ్యేటప్పటికి తాతయ్యబాబు వచ్చి ఏరోయి! ఎక్కడికి ప్రయాణం దంపతి సమేతంగా?.... అన్నాడు వ్యంగ్యంగాను.

"... ఎక్కడికీ లేదురా, కూర్చో, సినిమాకి వెళదామనుకుంటున్నాము .." అన్నాడు మోహనరావు. కాసేపు విచ్చాపాటీ మాటలాడుకున్నారు మామూలుగా అందరు.

"ఎలా రాక రాక వచ్చాను మీ ఇంటికి. కాస్త కాఫీయేనా యివ్వరేరా!" అన్నాడు ఛలోక్తిగా తాతయ్యబాబు.

"అన్నట్లు మర్చిపోయాను మాటల సందడిలో" అంటూ లలితకేసి చూశాడు మోహనరావు.

"తలవని తలంపుగా ఇప్పుడు ఇంకేం చేయుంటుంది. ఫ్లాస్కుతో పట్టుకొండి!" అని మామూలు ధోరణిలో భర్తతో చెప్పింది లలిత.

అనుకోకుండా భార్యాభర్తలు మాట్లాడడం తాతయ్యబాబు గ్రహించేశాడు. ఉండబట్టలేక తాతయ్యబాబు గట్టిగా నవ్వేశాడు. వాళ్ళకి అర్థంగాక యిద్దరు అతనికేసి చూసినా, అర్థం కాలేదు. ఏమిటంటూ మోహనరావు లలిత ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు.

"ఏం లేదు. నేను కాఫీ తాగే వచ్చాను. ఇక చాలు. మీ ఇద్దరూ సినిమాకి వెళ్ళండి. టైం అయిపోతుంది.' అని ఓ రిక్షాలో వారిద్దరిని ఎక్కించి నవ్వుతూ ఇంటికి బయలుదేరాడు .. ఎంతపని చేసిందా కేలండరు...." అనుకుంటూ.

★